వనం నుంచి.. జనం లోకి..



రోడ్లపై ఆహారం కోసం కోతుల వేట



పొలాల్లో పంటపై దాడులకు వెళ్తున్న కోతుల గుంపు

అడవుల తగ్గుదలే కారణమంటున్న ప్రకృతి ప్రేమికులు

పెనుగంచిప్రోలు: మనిషి కోతుల నుంచి పుట్టాడని అంటారు. కోతులకు వనాలు అనుకూలించక జనాల్లోకి తరలివస్తున్నాయి. వనాల్లో ఉల్లాసంగా గడుపుతూ కనిపించే కోతులు ప్రస్తుత పరిస్థితుల్లో వాటి మనుగడకు మనిషే అన్ని విధాలుగా కారణమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎక్కువగా అడవుల్లో సంచరించే కోతులకు నేడు జనావాసాలే దిక్కు అయ్యాయి. అడవులు తగ్గిపోవటంతో అవి ఆహారం కోసం రోడ్ల మీదకు, ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి.

వందల సంఖ్యలో..

నియోజకవర్గంలో జగ్గయ్యపేట పట్టణంతో పాటు జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో ఏ గ్రామంలో చూసినా వందల సంఖ్యలో కోతులు కనిపిస్తున్నాయి. అవి చేసే హడావిడి అంతా ఇంతా కాదు. మక్కపేట- చిల్లకల్లు, చిల్లకల్లు- జగ్గయ్యపేట రహదారిలో ఇవి రోడ్లకు ఇరువైపులా చేరి వాహనదారులు ఎవరు ఆహారం వేస్తారా అని ఎదురు చూస్తాయి. వేదాద్రి, తిరుమలగిరి ఆలయాల్లో భక్తులను ఇవి పెట్టే ఇబ్బందులు చెప్పనలవికానివి. భక్తుల చేతిలో ఏది ఉంటే అది లాక్కొని వెళ్లి పోతాయి. ఇళ్లల్లోకి చొరబడి ఆహారం పట్టుకెళ్లడంతో పాటు ఒక్కోసారి మనుషులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. గతంలో అడవుల్లో పండ్ల మొక్కలు, కాయలు దొరికేవి. అవి కరువవ్వటంతో జనావాసాల మధ్య చేరి ఆహారాన్ని దక్కించుకుంటున్నాయి. అలాగే మొక్కజొన్న, పత్తి పంటలతో పాటు కూరగాయల పంటలను తింటూ పాడు చేస్తున్నాయి. రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి.

వ్యర్థాలూ ఆహారమే..

కొందరు కూరగాయలు, పండ్ల వ్యాపారులు పాడైన వాటిని కుప్పగా వేస్తారు. కోతులన్నీ చేరి వాటిని తింటాయి. కొందరు ఆలయాలు, రోడ్ల మీద వాటికి పండ్లు, కాయలు అందిస్తారు. అవి తిని జీవిస్తున్నాయి.

కారణం ఇదేనా..

వన్య ప్రాణులకు ఫలాలు కరువయ్యాయి. అడవుల్లో తునికి, మారేడు, ఎలక్కాయలు, రేగి, పాలపండ్లు, పరికి మనుషులు వారి జీవనాధారానికి, ఇతర వ్యాపకాలకు తీసుకెళ్తున్నారు. దీంతో స్వేచ్ఛగా అడువుల్లో సంచరించే కోతులకు ఆహారం లేకుండా పోయింది. అలాగే చెట్లను విచక్షణారహితంగా నరికి వేస్తున్నారు. అడవుల్లో ఆహారం దొరికితే వణ్యప్రాణులు జనవాసాల మధ్యకు రావని ప్రకృతి ప్రేమికులు అంటున్నారు.

అరికట్టాలి..

కోతులతో పాటు ఇతర జీవరాశులు, పక్షులు జనావాసాల్లోకి రాకుండా ఉండాలంటే అడవులు అభివృద్ధి కావాల్సిన అవసరం ఉంది. అడవుల్లో పండ్లు, కాయలు కాసే మొక్కలను పెంచాలి. ప్రభుత్వాలు కూడా మొక్కటు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలి. ప్రజలు కూడా మార్పు కోసం ప్రయత్నించాలి. నియోజకవర్గంలో కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలి.

ఎన్నికల ముందు ఒక మాట.. తర్వాత మరోమాట

వైఎస్సార్‌సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నాలో వైఎస్సార్ సీపీ నేతలు తన్నీరు, విజిత తదితరులు

చిల్లకల్లు (జగ్గయ్యపేట అర్బన్, పెనుగంచిప్రోలు): బాబు షూరిటీ.. విద్యుత్ చార్జీల బాదుడు గ్యారంటీ అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వ విద్యుత్ పాలసీకి వ్యతిరేకంగా బుధవారం జగ్గయ్యపేట మండలంలోని చిల్లకల్లు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కరెంట్ చార్జీలు పెంచబోమని మభ్యపెట్టి గద్దెనెక్కిన బాబు ఆరు నెలల కాలంలో ఏకంగా రెండు సార్లు పెంచారన్నారు. మారానని, సూపర్ సిక్స్ పథకాలతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే మెరుగైన పాలన అందిస్తామంటూ మభ్యపెట్టిన సీఎం అయిన బాబు విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై రూ.15,485 కోట్ల భారం మోపారని ధ్వజం ఎత్తారు. ఆరు నెలల్లో రెండు సార్లు భారం మోపారన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో సగటున యూనిట్‌కు రూ.1.25 పైసలు పెంచుతున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు దేశంలో ఎక్కడా లేనివిధంగా తక్కువకు విద్యుత్ కొనుగోలు చేయటమే కాకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తూ రైతులకు వ్యవసాయానికి 9 గంటలు ఉచిత విద్యుత్ సరఫరా చేశారన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పిన బాబు అప్పులు చేస్తూ వారి నాయకులకు మాత్రమే సంపద సృష్టి స్తున్నారని ఎద్దేవా చేశారు. పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలన్నారు. పీడీఎస్ బియ్యంపై డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేస్తున్న షో ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సంపత్ విజిత, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి లాహోరి బద్దు నాయక్, జిల్లా కార్యదర్శులు మాతంగి నాగబాబు, వేముల మల్లేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షులు బూడిద నరసింహారావు, జగ్గయ్యపేట మున్సిపల్ వైస్‌చైర్మన్ ఫిరోజ్‌ఖాన్, పట్టణ అధ్యక్షులు వట్టెం మనోహర్, బీసీ సెల్ జిల్లా నాయకులు మండవ శ్రీనివాసగౌడ్, జిల్లా ఎస్సీసెల్ నాయకులు కన్నమాల శామ్యూల్, పట్టణ పార్టీ మాజీ అధ్యక్షులు చౌడవరపు జగదీష్, శ్రీకనదుర్గమ్మవారి ఆలయ డైరక్టర్ నంబూరి రవి, మహిళా నాయకురాలు చల్లా సుశీల, నాయకులు అన్నాబత్తుల శ్రీనివాసరావు, మోరె దుర్గాప్రసాద్, గోగుల వినోద్, దొంగల జానకిరామయ్య, ఉపేంద్రరెడ్డి, మైలా రామకృష్ణ, వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



కంచికచర్ల: మండలంలోనీ కీసర మున్నేటి ఒడ్డున రక్షిత మంచినీటి సరఫరా పథకం తాగునీరు సరఫరా అయ్యే ప్రధాన పైప్‌లైన్‌కు మరమ్మతు పనులు చేస్తున్నామని సర్పంచి బీ రవి కుమార్ బుధవారం తెలిపారు. రెండు నెలల క్రితం భారీగా కురిసిన వర్షాల కారణంగా మున్నేటి తీరాన అక్కడక్కడా ప్రధాన పైపులన్నీ పగిలిపోయాయి. దీంతో గండేపల్లి గ్రామానికి తాగునీరు సక్రమంగా సరఫరా చేయలేకపోతున్నామన్నారు. మరో రెండు రోజుల్లో మరమ్మతు పనులు చేపట్టి తాగునీరు గ్రామానికి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని సర్పంచి వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం



నందిగామ టౌన్: గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. చందాపురం నుంచి చందర్లపాడు మండలం పొక్కునూరు రోడ్డు మరమ్మతు పనులను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని రహదారులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతోందన్నారు. రూ.70 లక్షలతో ఐదు కి.మీల మేర రహదారికి మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యేచూరు రాము, శ్రీనివాసాచారి, శాఖమూరు స్వర్ణలత, షేక్ ఖాజా, వాసిరెడ్డి ప్రసాద్, వీరంకి వీరాస్వామి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చెత్త సంపద తయారీ కేంద్రాల పరిశీలన



కంచికచర్ల: గ్రామాల్లో పాలకులు, అధికారులు శానిటేషన్ పనులు చేపట్టాలని ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని వేములపల్లి, కంచికచర్ల, గండేపల్లి గ్రామాల్లో బుధవారం చెత్త సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రోడ్లపై చెత్తా చెదారం లేకుండా చూడాలని, డ్రెయినేజీల్లో మురుగు పారుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. బ్లీచింగ్, సున్నం చల్లించాలన్నారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను తయారీ కేంద్రాలకు తరలించాలని, తరలించిన చెత్తను పొడి, తడి చెత్తగా వేరు చేయాలని వర్మీ కంపోస్టు ఎరువులను తయారు చేయాలన్నారు. అనంతరం క్లాప్ మిత్రల పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో గండేపల్లి, వేములపల్లి, కార్యదర్శులు జిల్లేపల్లి రత్నాకర్, రామ్‌జీ, కంచికచర్ల శానిటరీ మేస్త్రి బెజ్జం భూషణం, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలకు చెక్



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో పోలీసులు బుధవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. వాహనాల తనిఖీలో నంబర్ ప్లేటు లేని పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు పట్టణ ఎస్ఐ జి.రాజు, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు ద్విచక్ర వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు వాహనాలతో పాటు ఉండాలని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్లు ఉండాలని తెలిపారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నాగేశ్వరరావు, హెడ్‌కానిస్టేబుల్ ఏడుకొండలు, సుబ్బారెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది వెంకటేశ్వరరావు, నాగేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎంపీపీల సంఘ అధ్యక్షుడిగా గాంధీ



గాంధీని సత్కరిస్తున్న రవీంద్రారెడ్డి, పక్కన శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు

పెనుగంచిప్రోలు: వైఎస్సార్ సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడిగా పెనుగంచిప్రోలు మండల ఎంపీపీ మార్కపూడి గాంధీ ఎంపికయ్యారు. ఈ మేరకు తాడేపల్లిగూడెంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎంపీపీలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎంపీపీల సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు గాంధీ బుధవారం తెలిపారు. తనతో పాటు ఉపాధ్యక్షుడిగా బ్రహ్మంగారి మఠంకు చెందిన సీహెచ్ నారాయణరెడ్డితో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారన్నారు. వత్సవాయి మండలం ఎంపీపీ కొలుసు రమాదేవిని రాష్ట్ర కార్యదర్శిగా నియమించారన్నారు. క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ ప్రభుత్వవిప్ జి.శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ విభాగపు రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సమక్షంలో నియామకాలు జరిగాయన్నారు. తనను నియమించినందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మినీ అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

చందర్లపాడు(నందిగామటౌన్): అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు అవసరమైన వసతులు, పోషణ, నిర్వహణ, తదితర సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని బొబ్బిళ్లపాడు గ్రామంలో రూ.10.25 లక్షలతో నూతనంగా నిర్మించిన మినీ అంగన్‌వాడీ- 2 భవనాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులు రూ.ఐదు లక్షలు, ఎన్ఆర్‌యూఎం నిధులు రూ.నాలుగు లక్షలు, గ్రామ పంచాయతీ నిధులు రూ.1.25 లక్షలతో భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి



ఘంటసాల విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, సేవాసమితి ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: అమర గాయకుడు పద్మశ్రీ ఘంటసాల 102వ జయంతి వేడుకలు పట్టణంలో బుధవారం ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్పీ బాలు కళారాధన సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కోదాడ రోడ్‌లోని ఘంటసాల విగ్రహానికి మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, జనసేన నాయకులు, కళాకారులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ ఘంటసాల మన మధ్య లేకపోయినప్పటికీ ఆయన ఆలపించిన మధురమైన గీతాలు నేటికీ తెలుగువారి మదిలో నిలిచిపోయాయన్నారు. ఈ భూమి ఉన్నంత కాలం ఆయన ఆలపించిన పాటలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కళారాధన సేవా సమితి అధ్యక్షుడు మీసాల బాబ్జి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనసేన నాయకులు మానేపల్లి బ్రహ్మం, షేక్ సత్తార్, షేక్ ఖాజా, కొత్తా పురుషోత్తం, చిన్ని దుర్గారావు, పి.కృష్ణమూర్తి, కాంతారావు, సేవా సమితి సభ్యులు చిన్ని కృష్ణ, కొరిసెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయించిన ఇద్దరికి జరిమానా

కంచికచర్ల: గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తే కేసు నమోదు చేసి జైలుకు పంపుతామని ఎక్సైజ్ సీఐ షేక్ అఫ్రపున్నీసా బేగం హెచ్చరించారు. కంచికచర్ల ఎక్సైజ్ శాఖ పరిధిలో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యం విక్రయిస్తూ రెండోసారి పట్టుబడ్డారు. వీరిని రెవెన్యూ కార్యాలయంలో బుధవారం హాజరు పరచగా తహసీల్దార్ పీ జాహ్నవి ఒక్కొక్కరికీ రూ.30 వేలు జరిమానా విధించారు. ఈమేరకు సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించి అక్రమంగా మద్యం విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. వీరికి జరిమానా విధించటం జరుగుతుందని తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తూ రెండవసారి పట్టుబడితే మండల మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిస్తే రూ.లక్ష వరకు జరిమానా విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. బెల్టు దుకాణదారులకు ఏ షాపు నిర్వాహకులు మద్యం బాటిళ్లు ఇచ్చారో తెలుసుకుని, ఆ మద్యం షాపు నిర్వాహకులపై కేసు నమోదు చేస్తామని సీఐ అన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

నందిగామ రూరల్ సీఐ చవాన్



పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సీఐ చవాన్

కంచికచర్ల: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నందిగామ రూరల్ సీఐ డీ చవాన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని వారి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మీ పిల్లలకు ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఇతర దేశాల్లో ఉన్న మీ పిల్లలను ఆ దేశ పోలీసులు అరెస్ట్ చేశారని ఫోన్ చేస్తుంటారని, అటువంటి మాటలు నమ్మవద్దన్నారు. బ్యాంకులో కేవైసీ చేయించాలని బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, బహుమతులు గెలుచుకున్నారని, ప్రైజ్ మనీ వచ్చిందని, వాటికి డబ్బు చెల్లించాలని, ఇన్‌కం టాక్స్ కట్టాలని ఫోన్‌లు చేస్తుంటారని, ఇటువంటి సందర్భాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీలు చెప్పవద్దన్నారు. ఒంటరిగా ఉన్న వృద్ధ దంపతుల ఇళ్లలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇళ్లలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. సమస్య వచ్చినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించా లన్నారు.

దుప్పట్ల పంపిణీ..

విశ్రాంత ఉద్యోగుల సంఘ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీలలో పనిచేసే 60 మంది పారిశుద్ధ్య కార్మికులకు సీఐ దుప్పట్లు పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులు నిత్యం చేస్తున్న సేవలు చాలా గొప్పవని వారిని అభినందించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరావు, సంఘ నాయకులు నాగేశ్వరరావు, స్వర్ణలత, పెద్దిసీడి కోటేశ్వరరావు, బీవీ సర్వేశ్వరరావు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో అయ్యప్పలకు సద్ది

పెనుగంచిప్రోలు: అయ్యప్ప స్వామికి ఎంతో ఇష్టమైన అన్నదాన కార్యక్రమాన్ని దాతల సహకారంతో 2015 నుంచి ప్రారంభించి ఎందరో మన్ననలు పొందుతున్నారు. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ప్రతి రోజూ అనేక జిల్లాల నుంచి అయ్యప్ప దీక్షా స్వాములు వచ్చి దర్శించుకుంటారు. వారందరూ సద్ది (భోజనం) కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. వారిని దృష్టిలో ఉంచుకొని, ఇంట్లో కుదరని వారి కోసం మునేరు కాజ్‌వే పక్కన శ్రీరుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈసద్ది కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈఏడాది అక్టోబర్ 27న అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు వాసిరెడ్డి బెనర్జీ చేతుల మీదుగా ప్రారంభమైన ఈకార్యక్రమం ఈనెల 6వ తేదీ వరకు కొనసాగనుంది. ప్రతి రోజూ 300 మంది స్వాములు వస్తుండగా, శుక్ర, ఆదివారాల్లో 400 మందికి పైగా స్వాములు ఇక్కడ సద్ది చేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తాతయ్య, సీసీఐ బయ్యర్లు, తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: పత్తి రైతుల సౌకర్యార్థం పట్టణంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని పత్తి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కోదాడ రోడ్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) 2024- 25 సంవత్సరానికి ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే తాతయ్య ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పత్తి క్వింటా రూ.7,521 మద్దతు ధర ప్రకటించిందన్నారు. రైతులు దళారీల మాటలు విని తక్కువ ధరలకు నష్టపోవద్దని తెలిపారు. సీసీఐ బయ్యర్ రమేష్, ఏఎంసీ సెక్రటరీ ఎస్వీ.నరసింహారావు మాట్లాడుతూ రైతులు గోనె బోరెలలో పత్తిని తెచ్చుకోవాలని, 12 శాతం లోపు తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. నాయకులు కొటారు సత్యనారాయణ ప్రసాద్, కట్టా నరసింహారావు, మైనేని రాధా, యానాల గోపి, గుంజ ఏడుకొండలు, దుర్గాప్రసాద్, పల్లెబోయిన నాగరాజు, కారం శ్రీను, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కార్యదర్శులు అందుబాటులో ఉండాలి

వీరులపాడు: గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని ఎంపీడీవో అరుంధతీదేవి పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తుల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కుక్క అడ్డురావటంతో బైక్ పల్టీ



గాయపడిన అర్చకుడు కృష్ణమాచార్యులు

కంచికచర్ల: బైక్‌కు కుక్క అడ్డురావటంతో బైక్‌పై వెళ్లుతున్న భార్యభర్తలు రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలైన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం కంచికచర్ల వసంత కాలనీలో నాగలక్ష్మి అమ్మవారి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్న వేదాంతం కృష్ణమాచార్యులు తన భార్యతో కలిసి విజయవాడ నుంచి కంచికచర్ల బైక్‌పై వస్తున్నారు. మండలంలోని పరిటాల మసీదు సెంటర్‌కు రాగానే ఓ కుక్క వేగంగా వచ్చి బైక్‌కు తగిలింది. దీంతో బైక్ నడుపుతున్న వ్యక్తితో పాటు ఆయన భార్య రోడ్డుపై పడ్డారు. కృష్ణమాచార్యుడికి తీవ్ర గాయాలు కాగా ఆయన భార్యకు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితుడిని వైద్య చికిత్స కోసం కంచికచర్ల ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

దివ్యాంగుల్లో ఆత్మ స్థైర్యాన్ని నింపాలి



దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ నాగమణి, ఎంపీపీ గాంధీ, ఎంపీడీఓ శ్రీను, ఎంఈఓ రవీంద్ర, తదితరులు

పెనుగంచిప్రోలు: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి అన్నారు. బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలను భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియో థెరఫీ కేంద్రాలకు తీసుకు రావటం వలన వారిలో అనేక మార్పులను చూడవచ్చన్నారు. పలు క్రీడల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. దివ్యాంగులకు, వారి తల్లిదండ్రులకు భోజనం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శాంతిలక్ష్మి, ఎంపీడీఓ జి.శ్రీను, ఎంఈఓ డి.రవీంద్ర, హెచ్‌ఎం కె.జలజ, జగదీష్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కె.కోటేశ్వరి, ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఉపాధ్యాయులు శివపార్వతి, జోయస్‌లీల, సీఆర్‌పీలు చిన్నగోపాలరావు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

- జీతాలు విడుదల చేయాలని డిమాండ్
- వైఎస్సార్ సీపీ నేత మనోహర్ సంఘీభావం



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ కార్మికులు, మాట్లాడుతున్న వట్టెం మనోహర్

జగ్గయ్యపేట అర్బన్: మున్సిపల్ కార్మికుల జీతాలను వెంటనే చెల్లించాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, 5వ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట పురపాలక సంఘంలో పనిచేస్తున్న కార్మికులు తమ జీతాలను వెంటనే చెల్లించాలని కోరుతూ బుధవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత రెండు నెలలుగా మున్సిపల్ కార్మికులకు జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈ విషయమై గతంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. గత నెల 30న జరిగిన కౌన్సిల్ మీటింగ్‌లో కూడా కార్మికుల జీతాల విషయమై ప్రస్తావించామన్నారు. డిసెంబర్ 1న జీతాలు అందజేస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వకుండా ఉంటే కార్మికులకు కడుపు మండదా, వారి కుటుంబ పోషణ ఎలా అంటూ ఆయన ప్రశ్నించారు. మున్సిపల్ కమిషనర్ వారికి సకాలంలో జీతాలు అందజేయాల్సింది పోయి, వారిపై ఏంటి ఈ సంత, ఏంటి మీ కాకి గోల అంటూ కార్మికులపై అవహేళనగా మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నెల ఒకటో తేదీన మున్సిపల్ కార్మికులకు జీతాలను అందించారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకొని కార్మికులకు వెంటనే జీతాలను అందజేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల జీతాల విషయంలో మొండి వైఖరి అవలంభిస్తే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. మున్సిపల్ కార్మికులు పారా ఎలకమ్మ, కోట సమాధానం, ఉపూరి భాస్కరరావు, ఉప్పుతోళ్ల రమణ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి ఉత్పత్తుల తయారీతో ఆదాయం



మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ అచ్యుతరాజు, పక్కన శాస్త్రవేత్తలు

గరికపాడు(జగ్గయ్యపేట): కొబ్బరితో చేసిన ఉత్పత్తులు ఎంతో రుచిగా ఉంటాయని గరికపాడు, కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ కె.అచ్యుతరాజు అన్నారు. బుధవారం కృషి విజ్ఞానకేంద్రంలో ఆత్మ సౌజన్యంతో కొబ్బరితో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొబ్బరితో చేసిన నాలుగు రకాల పదార్థాలను గ్రామీణ యువతులు ప్రదర్శించారు. కొబ్బరితో చేసిన లడ్డూలు, కొబ్బరినూనె, నిల్వ పచ్చడి, కొబ్బరి చాక్లెట్లు తయారు చేయటమే కాకుండా రుచి చూపించారు. ఈ సందర్భంగా అచ్యుతరాజు మాట్లాడుతూ కొబ్బరి ఉత్పత్తుల తయారీతో ఉపాధి కూడా పొందవచ్చన్నారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో ఆలయాలు ఎక్కువగా ఉన్నాయని, కొబ్బరికాయల వినియోగం కూడా ఎక్కువగా ఉంటుందని, పగులకొట్టిన కొబ్బరికాయల నుంచి కొబ్బరి, నీరు సేకరించి ఉత్పత్తులు తయారు చేయటం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చన్నారు. ఈకార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఐ.వెంకటరెడ్డి, శివప్రసాద్, జశ్వంత్‌రెడ్డి, రాజశేఖర్, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

నేడు పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

కంచికచర్ల: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం ఉదయం 10.30 గంటలకు సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్టు ఏఎంసీ కార్యదర్శి ఎస్.శ్రీనివాస్ బుధవారం తెలిపారు. సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభిస్తారని, పత్తి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్యదర్శి తెలిపారు.